# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 316 బుధవారం | 03 జూలై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


## సంపత్ రావుకు ప్రముఖుల పరామర్శ



ఎన్ఎస్ఆర్ గ్రూప్స్ అధినేత సంపత్ రావు తండ్రి నాయినేని రామారావు మృతి సందర్భంగా బుధవారం దశాహకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు హాజరై సంపత్ రావును పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. రామారావు మృతికి అశ్రు నివాళి అర్పించారు. సంపత్ రావును పరామర్శించిన వారిలో వరంగల్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ప్రముఖ కాంట్రాక్టర్ ఎంఎన్ మూర్తి, సీనియర్ జర్నలిస్ట్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, లింగంపల్లి జైపాల్ రావు, ఎర్రవెల్లి రవీందర్ రావు, మర్రి వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

– వరంగల్ వాయిస్, గూడెప్పాడ్



# పక్కపక్కనే ప్రత్యర్థులు

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్**

**రావణకాష్టాన్ని తలపిస్తోన్న వైనం**

**కార్యకర్తలతో సందడిగా మారుతున్న బాలసముద్రం**

**ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళనలో ప్రజలు**

అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల మధ్య రాజకీయ రచ్చ నడుస్తోంది. ప్రజా ప్రయోజనాలకోసం వదిలిన స్థలంలో నాలుగేళ్ల క్రితం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవనం నిర్మించడం రెండు పార్టీల మధ్య అగ్గి రాజేసింది. తెలంగాణలో తమకు ఎదురులేదని భావించిన బీఆర్ఎస్ పెద్దలు హనుమకొండలోని బాలసముద్రంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే ఆ పార్టీ కార్యాలయం నిర్మించడం వివాదాలకు దారితీసింది. గతంలో క్యాంపు కార్యాలయంతోపాటు పార్టీ ఆఫీస్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలే ఉన్నందున ఎలాంటి సమస్య రాలేదు. నేడు పరిస్థితి మారింది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి నాయిని రాజేందర్ రెడ్డి విజయం సాధించారు. దీంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రాజేందర్ రెడ్డి అధికారిక నివాసంగా మారింది. నిత్యం క్యాంపు కార్యాలయానికి వచ్చే అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆ ప్రాంతమంతా సందడిగా మారుతోంది. అయితే దీని పక్కనే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఉంది. అక్కడికి బీఆర్ఎస్ పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు తరలి రావడంతో ఇరు వర్గాలమధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. బాలసముద్రం ప్రాంతం నిత్యం రావణకాష్టాన్ని తలపిస్తోంది. ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది.

– వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..



8లో..

## 6నుంచి శాకాంబరి ఉత్సవాలు

**పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని**



8లో

## బాలల సంరక్షణ సామాజిక బాధ్యత

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**క్షేత్రస్థాయిలో ట్రాఫిక్ జంక్షన్ల పరిశీలన**




# పక్కపక్కనే ప్రత్యర్థులు




**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్**

**రావణకాష్టాన్ని తలపిస్తోన్న వైనం**

**కార్యకర్తలతో సందడిగా మారుతున్న బాలసముద్రం**

**ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళనలో ప్రజలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉద్యమాలకు నెలవైన ఓరుగల్లులో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పార్టీ బిల్డింగ్ రగడ కొనసాగుతోంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ నిర్మాణం ఇరు వర్గాలను కుదుపేస్తోంది. బీఆర్ఎస్ అధికార మదంతో అడ్డగోలుగా ప్రభుత్వ స్థలాన్ని కొట్టేసి పార్టీ కార్యాలయం నిర్మించడాన్ని కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రజల ఉపయోగార్థం కేటాయించిన పార్క్ స్థలాన్ని అప్పనంగా ఆక్రమించుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కదలని సిబ్బంది..

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నిర్మాణం మొదటినుంచి వివాదాస్పదంగానే మారింది. రూ.60కోట్ల ప్రభుత్వ భూమిని అప్పనంగా కాజేసి పార్టీ భవనాన్ని నిర్మించారంటూ అప్పటి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రస్తుత పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో వైరం ముదిరింది. రాజేందర్ రెడ్డి ఫిర్యాదుతో స్పందించిన నగరపాలక సంస్థ అధికారులు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడికి గతంలోనే రెండు పర్యాయాలు నోటీసులు జారీ చేశారు. అయినా బీఆర్ఎస్ పార్టీ నేతలనుంచి ఎలాంటి స్పందన రాలేదు. రాష్ట్రంలో అధికారం మారింది. బీఆర్ ఎస్ పార్టీ ప్రతిపక్షానికి పరిమితం కాగా కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని కైవసం చేసుకుంది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా విజయం సాధించిన నాయిని రాజేందర్ రెడ్డి కబ్జాకు గురైన పార్టీ కార్యాలయ స్థలంపై మరోమారు బల్దియా అధికారులకు ఫిర్యాదు చేశారు. ముచ్చటగా మూడో సారి ఫిర్యాదు అందుకున్న గ్రేటర్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బల్దియా డిప్యూటీ కమిషనర్ గోడిశాల రవీందర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ నిర్మాణం అక్రమమంటూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ కు నోటీసులు జారీచేశారు.



## కబ్జా స్టైల్ మామూలుగా లేదు..

అత్యంత ప్రైమ్ ఏరియాగా గుర్తించిన బాలసముద్రంలో గజం ధర రూ.లక్ష కంటే ఎక్కువే పలుకుతోంది. అయితే ఇవేమీ పట్టించుకోకుండా గజం కేవలం రూ.100 చొప్పున ఎకరం స్థలం కొట్టేశారు. పార్క్ కోసం ఏర్పాటు చేసిన స్థలాన్ని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడే పెద్ద స్కామ్ జరిగింది. బల్దియా అధికారులు, బీఆర్ఎస్ నేతల సంయుక్త ఆధ్వర్యంలో అక్రమాన్ని సక్రమంగా చూపించేందుకు ప్రయత్నించారు. ఈ స్కాంలో పెద్దమొత్తంలోనే నిధులు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. పనిలో పనిగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వెనకాల ఉన్న మరో ఎనిమిది గుంటల స్థలాన్ని కూడా కబ్జా చేశారు. ఇంటి నంబర్ లేకుండా కరెంట్ మీటర్ ఇవ్వొద్దనే రూల్ ఉన్నా.. ఆ శాఖలో పెద్ద హొదాలో ఉన్న ఒకాయన చెప్పగానే పనులు చకచకా జరిగి మీటర్, కరెంట్ ఇచ్చేశారన్న ఫిర్యాదులున్నాయి. ఇలా ఇంకా ఎన్నెన్నో బాగోతాలున్నట్లు ప్రచారం సాగుతోంది.

## ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి..

పార్క్ స్థలాన్ని కబ్జాచేసి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని నిర్మించడంపై స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా తప్పుబడుతున్నారు. వివాదాస్పద బిల్డింగ్ ను వెంటనే కూల్చి వేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే నిర్మాణం పూర్తి అయిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది. దానిని వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని అందులో ఏదైనా ప్రభుత్వ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అప్పుడే తగిన న్యాయం జరుగినట్లవుతుందంటున్నారు. లేకుంటే క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఉండడంతో ఎప్పుడూ ఉప్పు..నిప్పు లాగా వాతావరణం ఉంటుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. వెంటనే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# టెక్స్టైల్ పార్క్‌లో సదుపాయాలు

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**

**జిల్లా కలెక్టర్ సత్య శారదాతో కలసి అధికారులతో సమీక్ష**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** టెక్స్‌టైల్ పార్క్ కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయుటకు చర్యలు తీసుకోవాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాతో కలసి ఆయన టీజీఐఐసీ, రోడ్లు భవనాలు, నీటిపారుదల, అటవీ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా పర్యటనలో మెగా టెక్స్టైల్ పార్క్ సందర్శన సందర్భంగా ముఖ్యమంత్రి టెక్స్టైల్ పార్క్ కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు 100 గజాల స్థలంలో అన్ని వసతులతో కూడిన ఇందిరమ్మ ఇల్లు మంజూరు ప్రకటించిన దృష్ట్యా చర్యలు తీసుకోవాలన్నారు. వరద ముంపు నివారణకు ఇదివరకు టెక్స్టైల్ పార్కు వద్ద నిర్మించిన రిటైన్ వాల్ వల్ల వరద చేరకుండా నివారించవచ్చున్నారు. లేకుంటే మరో రిటైన్ వాల్, బ్రిడ్జి ఏర్పాటుకు ప్రతిపాదించాలన్నారు. వరద నీటిని కాలువల ద్వారా సమీప ఎలుగూర్ రంగంపేట చెరువులోకి పంపించేలా ప్రతిపాదన సిద్ధం చేయాలని సూచించారు. భూ నిర్వాసితులకు 100 గజాల ప్లాట్లు, ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించుటకు, నిర్మించే కాలనీకు, టెక్స్టైల్ పార్కు కు మిషన్ భగీరథ ద్వారా చలివాగు నుంచి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు 45 కిలోమీటర్ల మేర పైపులైన్ వేయడం జరిగిందని, పనుల్లో వేగం పెంచి ఆగస్టులోగా నీరు అందించాలన్నారు. మేజర్ గ్రామపంచాయతీగా గుర్తించుటకు చర్యలు చేపట్టాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. భూ నిర్వాసితులకు ఇప్పటివరకు 1,350 ఎకరాలు సేకరించామని, పైలాన్ ప్రక్కకు గల మరో 45 ఎకరాలు సేకరించి 1,233 ప్లాట్లుకు పట్టా పత్రాలు అందించి మౌలిక సదుపాయలు కల్పించాలని రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులను కోరారు. వన మహోత్సవంలో భాగంగా టెక్స్టైల్ పార్క్ లో ప్రణాళికబద్ధంగా పెద్ద ఎత్తున అనువైన మొక్కలు నాటేందుకు సహకరించాలని అటవీ శాఖ అధికారులను కోరారు. పార్క్ లో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కృష్ణవేణి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి నాయక్, జిల్లా పరిశ్రమల అధికారి నరసింహమూర్తి, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారి ఖాసిం, మిషన్ భగీరథ ఈఈ మాణిక్ రావు, జిల్లా ఉద్యానవనాల అధికారి శ్రీనివాసరావు, ఎఫ్ఆర్ ఓ సదానందం, నీటి పారుదల శాఖ ఏఈఈ విజయలక్ష్మి, తాసిల్దార్లు రాజ్ కుమార్, రియాజుద్దీన్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బాల సదనం సందర్శన..

నర్సంపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సంజీవిని బాల సదనాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. సంజీవని బాల సదనంలో కలియతిరిగుతూ వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలతో కలసి కలెక్టర్ భోజనం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాలసదనంలో బాల బాలికలకు వేరువేరు భవనాలు ఉన్నందున వెంటనే ప్రహరీ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్నీ కోల్పోయి అనాథగా మిగిలిన పిల్లలకు తాము ఉన్నామంటు హక్కున చేర్చుకొని అండగా నిలబడుతున్నామన్నారు. బాలసదన ఆశ్రమం ఆడపిల్లలకు రక్షణతోపాటు నాణ్యమైన విద్యాభ్యాసాన్ని అందిస్తు తల్లిదండ్రుల కంటే ఎక్కువ స్థాయిలో పిల్లలకు ప్రేమను పంచుతూ అనాథ చిన్నారులకు అండగా నిలబడడమే కాక వారి జీవితానికి భరోసా కల్పిస్తున్నాయని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ కృష్ణవేణి, నర్సంపేట తాసిల్దార్ రాజేష్, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, బాల సదనం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.




# రేపు విద్యాసంస్థల బంద్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** జులై నాలుగున దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల బంద్ కు విద్యార్థి సంఘాల పిలుపునిచ్చాయి. నీట్, నెట్ పరీక్ష పేపర్ లీక్‌పై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు జూలై 4న దేశవ్యాప్తంగా పాఠశాలు, కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఎన్‌టీఏ రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఎస్ఐఎఫ్, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, పీడీఎస్ఓ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. వన్ నేషన్-వన్ ఎగ్జామ్ పేరుతో విద్యార్థుల భవిష్యత్తుకు ముప్పు ఏర్పడిందని, మొత్తం పరీక్షల వ్యవస్థనే కుప్పకూలిందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో ఎన్‌టీఏ విఫలమైందని, దేశంలో విద్యావ్యవస్థపై దాడికి నిరసనగా జూలై 4న దేశవ్యాప్త బంద్‌కు ఎస్ఎఫ్ఐ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ పిలుపునిచ్చింది. ప్రస్తుత కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులు పూర్తిగా చదువులో నిమగ్నమై ఉన్న తరుణంలో ఎనిమిది డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా బంద్‌కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి.

## ప్రభుత్వ పాఠశాలకు వాటర్ కూలర్ వితరణ

### ఔదార్యాన్ని చాటుకున్న పూర్వ విద్యార్థులు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలకు తమ వంతు సహకారాన్ని అందించాలన్న సంకల్పంతో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల తొర్రూరుకు చెందిన 1989 -1990 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు వాటర్ కూలర్, క్రీడా సామాగ్రిని బహుకరించి ఔదార్యాన్ని చాటుకున్నారు. పూర్వ విద్యార్థులంతా సమ్మేళనమై మిత్ర బృందం సహకారంతో పాఠశాలకు రూ.50వేల విలువ చేసే 100 లీటర్ల వాటర్ కూలర్, క్రీడా సామాగ్రిని బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయ బృందానికి అప్పగించారు. ఈ బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు బైరి శ్రీనివాస్, వజినపల్లి శ్రీనివాస్, రూపిరెడ్డి కృష్ణారెడ్డితో పాటు మిత్రులంతా సమిష్టిగా అందించిన ఆర్థిక సహకారంతో వాటర్ కూలర్, క్రీడా సామాగ్రిని కొనుగోలు చేసి పాఠశాలకు బహూకరించారు. విద్యాబుద్ధులను నేర్పి జీవన గమనాన్ని నిర్దేశించుకునే జ్ఞానాన్ని ప్రసాదించిన పాఠశాలకు తమ వంతుగా ఏదైనా సహకారం అందించాలన్న సంకల్పంతో, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల్లో సేవాస్ఫూర్తిని నింపాలన్న తలంపుతో ఈ కార్యక్రమాన్ని తీసుకున్నామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కష్టపడి చదివిన ఎంతోమంది ఉన్నత స్థాయికి ఎదగారని వారిని స్ఫూర్తిగా తీసుకొని ఇష్టంతో కష్టపడి చదువుకోవాలని సూచించారు. పాఠశాలకు తమ వంతు సహకారం అందించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుర్ర శ్రీనివాస్, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డాక్టర్ ఎస్.నాగవాణి, వజినపల్లి అనిల్ కుమార్, రావుల యాదగిరి, మారిపెల్లి రాజు, గద్దల భిక్షపతి, వెంకటరమణ, జి.శ్రీనివాస్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసాపై రైతులు సలహాలు, సూచనలు ఇవ్వాలి

### జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** రైతు భరోసాపై రైతులు సూచనలు, సలహాలు ఇవ్వాలని జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి అన్నారు. చెన్నారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం అత్యవసర సర్వసభ సమావేశం సొసైటీ డైరెక్టర్ జంగిలి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కొంతమంది రైతులు 5 ఎకరాలకు ఇవ్వాలని, మరి కొంతమంది 10 ఎకరాలకు ఇవ్వాలన్నారు. అలాగే, కౌలు రైతులకు కూడా వర్తింపచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏవో శశికాంత్, ఏఈఓలు సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

## సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన ఆత్మకూరు సీఐ సంతోష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సంతోష్ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝూను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలను అందజేశారు. నిజాయితీగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందించాలని పోలీస్ కమిషనర్ నూతన ఇన్ స్పెక్టర్‌కు సూచించారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

### ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ కోరారు. చిన్నారుల మొహంలో చిరునవ్వులు చిందించేలా చేద్దాం, నిస్సహాయత లేని చిరునవ్వులే మన లక్ష్యమన్నారు. చిన్న పిల్లల్ని ఎవరైనా వెట్టిచాకిరికి గురి చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. సమన్వయంతో పనిచేసి చిన్నారులను బాల్యాన్ని కాపాడుదామని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ పదో విడత కార్యక్రమం జూలై 1 నుంచి 31 వరకు జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో అమలు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆపరేషన్ ముస్కాన్-%శ% అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ కార్యాలయంలో పోస్టర్ ను ఆవిష్కరించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతీ సబ్ డివిజన్ పరిధిలో ఒక ఎస్ఐ, నలుగురు సిబ్బందిని ఒక బృందంగా నియమిచడం జరిగిందని తెలిపారు. పోలీసులు శాఖతో పాటు ఇతర శాఖలా అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా రెండు ప్రత్యేక బృందాలు ఈ నెల రోజుల పాటు ఆపరేషన్ ముస్కాన్-%శ%లో భాగంగా బాల కార్మికులను గుర్తించడానికి దాడులు నిర్వహిస్తారని తెలియజేశారు. ఎక్కడైనా బాలకార్మికులను గుర్తిస్తే వెంటనే 1098 లేదా డయల్ 100 లేదా స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ గంధ్రతి మోహన్ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్-%శ% బృందాలలో నియమింపబడిన పోలీస్ అధికారులు, సిబ్బంది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్ మెంట్,హెల్త్ డిపార్ట్ మెంట్, వివిధ డిపార్ట్ మెంట్ అధికారులతో పోలీస్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ డా.నాగవాణి, డీడబ్ల్యూఎం వరలక్ష్మి, సీడబ్ల్యూసీ మెంబర్ డేవిడ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష్, లేబర్ కమిషనర్ జగదీష్, లేబర్ ఆఫీసర్ రమేష్, డీఈఓ రామారావు, బాల రక్షా భవన్ కోర్డినేటర్ లక్ష్మి, డీసీపీవో వీరన్న, నరేష్, చైల్డ్ లైన్ కోర్డినేటర్ వెంకటేష్, కళ్యాణి, వసుంధర, ప్రభు, అనిల్, సీసీఎస్ సీఐ చంద్రమౌళి, డీసీఆర్బీ సీఐ సత్యనారాయణ, సీసీఎస్ ఎస్.ఐ ఉమా, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి లడే శివ ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్యలపై తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్ గౌడ్ విచ్చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీళ్లు- నిధులు-నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నారనేది జగమెరిగిన సత్యమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపించినట్లుగానే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తూ హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుందని మండిపడ్డారు. ఈ మోసాలను ఎండగడుతూ తెలంగాణ యువత తరపున, నిరుద్యోగుల తరపున బీజేవైఎం గత కొన్ని సంవత్సరాలుగా పోరాటాలు చేస్తూనే ఉంది. అయినప్పటికీ ఈ నియంతృత్వ ప్రభుత్వం కనీస స్పందన లేకుండా కాలం గడిపేస్తుంది. నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుంది. కాబట్టి, మీరైనా ఈ నిరుద్యోగ సమస్యలను జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు రాజు, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి, భూత అధ్యక్షుడు బాసాని నవీన్, కోమటి రాజశేఖర్, కదారి చంద్రమౌళి తదితరులున్నారు

## శ్రీనిధికి జిల్లా ప్రథమ బహుమతి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలలో భాగంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కాప్స్ (ఎన్జీసీ), వరంగల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థులకు వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోస్టర్ తయారీ పోటీలో చెన్నారావుపేట మండలంలోని సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థిని ముదురుకోల శ్రీనిధి ప్రథమ స్థానం సంపాదించింది. ఈ సందర్భంగా విద్యార్థి శ్రీనిధి, గైడ్ టీచర్ గణేష్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్ ప్రశంసా పత్రం, మెమెంటోతో సత్కరించి అభినందించారని హెచ్ఎం కరుణాకర్ రెడ్డి తెలిపారు. భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకోగలగడం అనే అంశంపై వరంగల్ జిల్లాలోని అన్ని ఉన్నత జిల్లా స్థాయి కవితలు, పోస్టర్ తయారీ పోటీలలో పాల్గొన్న శ్రీనిధితో పాటు పాల్గొన్న విద్యార్థులు సహస్ర, మానస, అక్షయ, లహరి, ధరణి, బి.సహస్రలను పాఠశాల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు కళా, సృజనాత్మక రంగాలలో కూడా తమ పోటీ తత్వాన్నిపెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనుల పరిశీలన



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శారదా సందర్శించారు. కలెక్టర్ విద్యార్థులతో విద్య బోధనపై ముచ్చటించారు. మధ్యాహ్న భోజన మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు తరగతులను పరిశీలిస్తూ సమర్ధ నిర్వహణకు ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రతిరోజు పాఠశాలకు వచ్చి పరిశుభ్రం చేసేలా ఎంపీడీవోను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో గుర్తించి చేపడుతున్న పాఠశాలకు సంబంధించిన అభివృద్ధి పనులన్నింటిని వారం రోజుల్లోపు పూర్తి చేయాలన్నారు. వారం రోజుల అనంతరం పాఠశాలను మళ్లీ సందర్శిస్తానన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంచి వాతావరణం, నాణ్యమైన విద్య అందిస్తేనే విద్యార్థులు శ్రద్ధతో చదువుకునే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని ఆమె కోరారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, స్థానిక తహసీల్దార్ ఫణి కుమార్, ఇంచార్జి ఎంపీడీఓ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం చెన్నారావుపేట మండలంలోని తిమ్మరాయన్పాడు గ్రామంలో సర్వే నంబర్ 70లో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ను రైతులు కోరిన మేరకు, జిల్లా కలెక్టర్ స్వయంగా గ్రామంలో సందర్శించారు. సర్వే నంబర్ 70 అటవీ భూమి అని, నిబంధనల ప్రకారం ఈ భూమికి అసైన్ మెంట్ పట్టాలు వర్తించవని స్థానిక తహశీల్దార్ కలెక్టర్ కు వివరించగా, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి ఈ భూమిలో దున్నుతున్న రైతులు, వారికున్న ఆధారాల వివరాలతో కూడిన పూర్తి నివేదిక పక్షం రోజుల్లో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

# రేపు విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

## విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అసమర్థ ఎన్టీఏను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆఫీసులో ఐక్య విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్, పీడీఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు అలువాల నరేష్, ఎన్ఎస్ యూఐ వరంగల్ సిటీ అధ్యక్షుడు శ్రావణ్, పీడీ ఎస్ యూ ఉదయ్ లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ పైన ఆందోళనలు జరుగుతున్నప్పటికీ కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. పీహెచ్ డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి, టీఐఎస్ఎస్ ముంబై , ఐఐటీ ముంబై నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘం నేతలపై అక్రమ కేసులు నిర్బంధాలు యూనివర్సిటీలో స్వేచ్ఛ, భావ వ్యక్తికరణ, ప్రజాస్వామ్య అణచివేత చర్యలను ఆపాలని, పాఠశాలలు మూసివేతను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ రేపు విద్యార్థి సంఘాలు ఇచ్చిన కేజీ టు పీజీ దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ కు ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యావేత్తలు మేధావులు, విద్యార్థులు విద్యాసంస్థల యాజమాన్యాలు అన్ని వర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మౌటం శివకుమార్, ప్రభాస్ ,అభిరామ్, సోను, పీడీఎస్ యూ నాయకులు రమేష్, భరత్, ఏఐఎఫ్ డీఎస్ నాయకులు తరుణ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి విద్యాసంస్థల బంద్‌కు ఎల్ హెచ్‌పీఎస్ సంపూర్ణ మద్దతు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రేపటి దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ కు ఎల్ హెచ్ పీఎస్ సంపూర్ణ మద్దుత తెలిపింది.దేశంలో విద్యా రంగం పట్ల, పరీక్షల నిర్వహణ పట్ల, పేపర్ లీకేజీల పట్ల ఎల్ హెచ్ పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ మాట్లాడుతూ నీట్, యూజీసీ నెట్ పరీక్ష పేపర్ల లీకేజీ వలన నష్టపోయి ఆందోళన చెందుతున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు పూర్తిస్థాయి భరోసా కల్పించడంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎల్ హెచ్ పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది రాసిన నీట్ పేపర్ లీకేజీ ఘటనకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, పేపర్ లీకేజీ పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చే సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, పేపర్ లీకేజీ వలన నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, నేషనల్ టెస్ట్ ఏజెన్సీ ఎన్.టి.ఏ ను రద్దు చేయాలని, పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి దేవేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని, నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీకి ఘటనను నిరసిస్తూ జూలై 4న విద్యార్థి సంఘాలు ఇచ్చిన కేజీ టు పీజీ దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యావేత్తలు మేధావులు, విద్యార్థులు విద్యాసంస్థల యాజమాన్యాలు అన్ని వర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బదావత్ భాస్కర్, బానోత్ రాజ్ కుమార్, విజయ్ నాయక్ పాల్గొన్నారు.

# రేపటి విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

## ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కు పిలుపునివ్వడం జరిగిందని ఏఐఎస్ బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ తెలిపారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని, పెండింగ్ లో ఉన్న రూ. 7100 కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని, రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న వీసీల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో , కళాశాలలో ఖాళీగా ఉన్నటువంటి పోస్టులను భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా రేపు విద్యాసంస్థలు బంద్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజాసేవకు పదవీ విరమణ లేదు



**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రజల కోసం వారి అభివృద్ధి కోసం నిత్యం ప్రజల మధ్య ఉండి సేవ చేసే ప్రజాప్రతినిధులకు పదవీ విరమణ ఉండదని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు చేసిన అభివృద్ధి, సేవల ద్వారానే గుర్తింపు పొందాలని పదవి ద్వారా గుర్తింపు రాదని ఆయన తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా మండలంలోని గ్రామాలలో నిత్యం ప్రజల మధ్య ఉండి అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో పనిచేసిన పాలకవర్గానికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. అనంతరం జడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అంతకుముందు జడ్పీటీసీ కోడెపాక సుమలత కరుణాకర్, ఎంపీపీ మచ్చ అనసూయ రవీందర్, వైస్ ఎంపీపీ చందా కుమారస్వామిలు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా సహకరించిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ప్రజలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నడికూడ ఎంపీటీసీ అప్పం చేరాలు, నర్సక్క పల్లి ఎంపీటీసీ బుర్ర దీప దేవేందర్ గౌడ్, రాయపర్తి ఎంపీటీసీ పర్నెం శ్రీలత మల్లారెడ్డి, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కుడ్ల మల్ హల్ రావు, మండల యూత్ అధ్యక్షుడు అప్పం కుమారస్వామి, నాయకులు పర్నెం మల్లారెడ్డి, వివిధ గ్రామాల కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెరుమాండ్లకు నామినేటేడ్ పోస్ట్ ఇవ్వాలి

## ఏబీఎస్, డీబీఎఫ్ నేతలు కలకోటి మహేందర్, మాదాసి సురేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరుపేదలకు ఉచితంగా మెరుగైన వైద్యాన్ని అందిస్తున్న పేదల డాక్టర్ గా పేరుగాంచిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డిపార్ట్ మెంటు హనుమకొండ జిల్లా చైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణకు రాజ్యసభ ఎంపీగా లేదా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ప్రముఖ న్యాయవాది,అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్)జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ లు కోరారు. ఈ మేరకు బుధవారం పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డికి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా పెరుమాండ్ల రామకృష్ణ కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తూనే వైద్య రంగాన్ని ఎంచుకొని నిరుపేదలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నారని, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతున్నారని, గడిచిన శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి పనిచేశారని గుర్తు చేశారు. కాబట్టి, పెరుమాండ్ల రామకృష్ణకు పదవి రావడానికి సీఎం రేవంత్ రెడ్డి, అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పెరుమాండ్ల రామకృష్ణకు పదవి రావడానికి తన వంతుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదాసి సుదర్శన్, మోరే ఐలయ్య, మాట్ల మురళి, మాదాసి నవీన్, దార ప్రమీల, ధార పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# పదవులకు వన్నె తేవాలి



**వరంగల్ వాయిస్, సంగెం :** మనం చేసిన పనులతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం పొందుతామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు అన్నారు. సంగెం మండలం ఆశాలపల్లి గవిచర్ల రోడ్డులోని కూచన గార్డెన్స్ లో బుధవారం సంగెం ఎంపీపీ కందగట్ల కళావతి నరహరి ఆధ్వర్యంలో నిర్వహించిన సంగెం మండల పరిషత్ ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొని వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి, విజయవంతంగా పదవీ కాలాన్ని పూర్తి చేసినందుకు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ, ఎంపీటీసీలు పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా ప్రజా ప్రతినిధులను ఎమ్మెల్యే రేవూరి ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలెప్పుడు వచ్చినా కొంచెం కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రాజకీయ నాయకులు ప్రజలకు సేవ చేస్తూ, రాజకీయ ప్రస్థానంలో మరెన్నో ఉన్నతమైన పదవులు పొందుతూ వన్నె తేవాలని రేవూరి ప్రకాశ్ రెడ్డి కోరారు.

# రేపటి బంద్‌కు బీసీ సంఘం మద్దతు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేపు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఇచ్చిన విద్యా సంస్థల బంద్ కు బీసీ సంఘం పూర్తి మద్దతు ఇస్తున్నట్లు జాతీయ బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి పవన్ తెలిపారు. ఈ సందర్బంగా పవన్ మాట్లాడుతూ నిట్ పరీక్ష పేపర్ లీకేజీ, ఎన్ టీఏ సంస్థను రద్దు చేసి పరీక్ష మళ్లీ నిర్వహించాలన్నారు. 24 లక్షల మంది నిట్ పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలి, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ లో నిట్ పై చర్చ జరగాలని కోరారు. వెంటనే పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# నర్సక్క పల్లె ఎంపీటీసీకి సన్మానం



**వరంగల్ వాయిస్, పరకాల :** నియోజకవర్గంలోని నడికూడ మండల కేంద్రంలో ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో పరకాల అభివృద్ధి ప్రదాత, శాసనసభ సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి పాల్గొనిఎంపీటీసీలకు వీడ్కోలు పలికారు. నర్సక్క పల్లి ఎంపీటీసీ బుర్ర దీప దేవేందర్ గౌడ్‌ను ప్రత్యేకంగా సన్మానించి దీవించారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసి ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు.

# సీపీని కలిసిన నూతన ఇన్‌స్పెక్టర్లు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళా పోలీస్ స్టేషన్ 2, వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్లుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సువర్ణ, రామకృష్ణ ఇన్ స్పెక్టర్లు బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పాగుచ్చాలను అందజేశారు. నీజాయితీగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందించాలని పోలీస్ కమిషనర్ నూతన ఇన్ స్పెక్టర్లుకు తెలిపారు.

# సైబర్ నేరాలపై షీ టీమ్ అవగాహన సదస్సు



వరంగల్ వాయిస్, హనుమకొండ : మహిళలపై జరిగే నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ సబ్ ఇన్ స్పెక్టర్ కుమారస్వామి అన్నారు. బుధవారం హనుమకొండ (బాసిత్ నగర్ )ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని దాదాపు 150 మంది విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ఎవరి నుండైన ఇబ్బందులకు గురైనప్పుడు, ఎవరైనా అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా షీ టీమ్ వారికి సమాచారం ఇవ్వాలని, షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270 కి ఫిర్యాదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి, చట్టరీత్యా చర్య తీసుకుంటామన్నారు. విద్యార్థులు సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని, అలా పంచుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలో నివారించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ మాట్లాడుతూ నేటి కాలంలో అమ్మాయిలు చాలా జాగ్రత్తగా ఉండాలని ప్రయాణాలు చేసేటప్పుడు అపరిచిత వ్యక్తులతో ఎలాంటి విషయాలను, ఫోన్ నంబర్లను, ఫొటోలను షేర్ చేసుకోవద్దని, సోషల్ మీడియాలో పరిచయమైన వారితో ఎలాంటి వ్యక్తిగత విషయాలను షేర్ చేసుకోవద్దని, ప్రేమ పేరుతో వాళ్లు చెప్పే మాటలను నమ్మి తల్లిదండ్రులకు తెలుపకుండా తెలియని ప్రదేశాలకు వెళ్లకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం హెడ్ కానిస్టేబుల్ వీరేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ధరణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

## కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



వరంగల్ వాయిస్, చెన్నారావుపేట : మండల కేంద్రంలోని తహసిల్ కార్యాలయాన్నీ బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ధరణి రికార్డులను పరిశీలించారు. అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారదర్శకతతో క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ధరణి దరఖాస్తులను క్లియర్ చేయాలని, పెండింగ్ లేకుండా క్లియరెన్స్ వేగంగా జరగాలని తహశీల్దార్ ను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ కృష్ణవేణి, తహసీల్దార్ ఫణి కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పూర్వ వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



వరంగల్ వాయిస్, వరంగల్ : పూర్వ వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని పూర్వ వీఆర్ఏ రాష్ట్ర జాయింట్ ఆర్గనైసింగ్ సెక్రటరీ, జూనియర్ అసిస్టెంట్ వరంగల్ జిల్లా కర్ణకంటి రాజేష్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఎన్నో సంవత్సరాల సుదీర్ఘ పోరాటాలు చేస్తే 16000 మందికి విద్యార్హత ఆధారంగా వివిధ శాఖలలో సర్దుబాటు చేశారు. ర్యాండమైజేషన్ లో పోస్టింగ్స్ రాని 168 మందికి పోస్టింగ్స్ ఇవ్వాలి, మల్టీ జోనల్ లో పోస్టింగ్స్ ఇచ్చిన వారికి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలి, వివిధ శాఖల్లోకి వెళ్లిన వీఆర్ఏలను తల్లి శాఖలోకి తీసుకురావాలి, ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న వీఆర్ఏలకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలి, ఇప్పటికే చాలా మంది పూర్వ వీఆర్ఏలు ఆత్మహత్య చేసుకున్నారు, ప్రభుత్వం స్పందించి పూర్వ వీఆర్ఏల జీవితాలను ఆదుకోవాలని కోరారు

# ఇక నుంచి ఆన్‌లైన్‌లో సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల స్వీకరణ

వరంగల్ వాయిస్, హైదరాబాద్ : ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) దరఖాస్తులను ఇక నుంచి ఆన్ లైన్ లో స్వీకరించనున్నారు. సీఎంఆర్ఎఫ్ నిధులు పక్కదారి పట్టకుండా పారదర్శకతతో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందు కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో వెబ్ సైట్ ను రూపొందించారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ వెబ్ సైట్ ను మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ నిధులు పక్కదారి పెట్టిన నేపథ్యంలో ఈ విధానాన్ని రూపొందించారు. ఇక ముందు ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తులను ఈ వెబ్ సైట్ లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సీఎంఆర్ఎఫ్ కోసం తమ వద్దకు వచ్చే వారి వివరాలు తీసుకుని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ సిఫార్సు లేఖను జత చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అప్లికేషన్ లో సంబంధింత దరఖాస్తు దారుల బ్యాంక్ అకౌంట్ నెంబర్ తప్పనిసరిగా ఇవ్వాలి. అప్‌లోడ్ చేసిన తర్వాత సీఎంఆర్ఎఫ్ కు సంబంధించిన ఒక కోడ్ ఇస్తారు. ఆ కోడ్ ఆధారంగా ఒరిజినల్ మెడికల్ బిల్లులను సచివాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆన్ లైన్ ద్వారా అప్లికేషన్ ను సంబంధిత ఆస్పత్రులకు పంపించి నిర్ధారించుకుంటారు. అన్ని వివరాలు సరిగ్గా ఉంటే సీఎంఆర్ ఎఫ్ అప్లికేషన్ ను ఆమోదించి చెక్ ను సిద్ధం చేస్తారు. చెక్ పైన తప్పని సరిగా దరఖాస్తుదారుడి అకౌంట్ నెంబర్ ను ముద్రిస్తారు. దీని వల్ల చెక్ పక్కదారి పట్టే అవకాశం ఉండదు. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు చెక్ లను స్వయంగా దరఖాస్తుదారులకు అందజేస్తారు. ఈ నెల 15 తర్వాత సీఎంఆర్ఎఫ్ ధరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరిస్తారు. https//cmrf.telangana.gov.in సైట్ లో దరఖాస్తు అందుబాటులో ఉంటుంది.

# సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



వరంగల్ వాయిస్, వరంగల్ : తూర్పు నియోజకవర్గంలోని 27వ డివిజన్లోని ఎల్బీఆర్ కాలనీలో 230 కుటుంబాలకు మీటర్లు సాంక్షన్ చేసి ఎల్బీఆర్ కాలనీలో అభివృద్ధి చేస్తున్నందున సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు చిత్రటాపలకు టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ తో పాటు ఎల్బీఆర్ కాలనీవాసులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ కొండా దంపతుల నాయకత్వంలో ఎల్బీఆర్ కాలనీలో కాలనీ వాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గత 20 సంవత్సరాలుగా కరెంటు మీటర్లు లేక అభివృద్ధి లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎల్బీఆర్ కాలనీ వాసుల అవస్థలు చూసి చలించిన కొండా సురేఖ జిల్లా అధికారులతో మాట్లాడి ఎల్బీఆర్ కాలనీలో కరెంటు మీటర్లు పెట్టించి ఎల్బీఆర్ కాలనీ అభివృద్ధి కోసం పాటుపడుతున్న కొండా దంపతులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. మహిళా కాంగ్రెస్ నాయకులు గూడ శారద, రమ్య, కాలనీ అధ్యక్షుడు దౌడు నాగరాజ్, కమిటీ సభ్యులు శ్యామల, మార్కు, ఎలకొండ శ్రీనివాస్, వాడపల్లి రవి, ఎండీ హుస్సేన్, ఓరుగంటి రేణుక, దామెరకొండ విజయలక్ష్మి, కొండపర్తి శ్రీలత, ఎస్ కే రబ్బాని, తురక పద్మ, ఎల్బీఆర్ కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యూపీ ఘటనకు బీజేపీ ప్రభుత్వానిదే బాధ్యత

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి




వరంగల్ వాయిస్, హనుమకొండ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో హత్రాస్ జిల్లాలో జరిగిన ఘటనకు ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. బుధవారం హనుమకొండ బాల సముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ హిందూత్వం పేరుతో ప్రజలపై మూఢ నమ్మకాలను పెంచి పోషిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ప్రజలను శాస్త్రీయ ఆలోచలన వైపు నడవకుండా దేవుళ్లు, బాబాలు అంటూ ప్రజల మెదళ్లను కలుషితం చేస్తున్నారు విమర్శించారు. దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాలలోనే ఇలాంటి సంస్కృతి రోజు రోజుకు పెరిగి పోతున్నదని, అందులో భాగంగానే యూపీలో భోలే బాబా పేరుతో జరిగిన అధ్యాత్మిక కార్యక్రమంలో తొక్కిసలాట ఘటన అన్నారు. అక్కడి భక్తులకు సరైన ఏర్పాట్లు చేసి జాగ్రత్తలు తీసుకోవడంలో కూడా యూపీ బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ ఘటన విషయంలో వైఫల్యాన్ని అంగీకరించి "హోమ్ మంత్రి" రాజీనామా చేయాలని, భోలె బాబాకి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. యూపీ తొక్కిసలాట ఘటనలో మృతుల కుటుంబాలకి రూ. 50 లక్షలు ఎక్స్ గ్రేసియా ప్రకటించాలని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలన్నారు. ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షత వహించగా రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా నాయకులు వేల్పుల సారంగపాణి, బాషబోయిన సంతోష్, ఉట్కూరి ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి దొడ్డి కొమరయ్య వర్ధంతిని జయప్రదం చేయండి

## తాటిపాముల వెంకట్రాములు



వరంగల్ వాయిస్, వరంగల్ : నిజాం నిరంకుశ పాలనకు, దొరల భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, భూమికోసం భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి కార్యక్రమాలను రేపు ఘనంగా నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. నేటి జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడివెండి గ్రామంలో 1946 జూలై 4న ఎట్టి చాకిరికి వ్యతిరేకంగా , దున్నే వాడికే భూమి, రాచరిక పాలన అంతం కోసం సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపుపై నిజాంసైనికులు, రజాకార్లు, భూస్వాముల గుండాలు దాడి చేసి జరిపిన కాల్పులలో కొమరయ్య నిండు ప్రాణాలను వదిలి తొలి అమరుడైనాడని, ఆయోధుడి మరణంతో పోరాటం ఉధృతమై వేలాది మంది అమరుల త్యాగాలతో నిజాం పాలనకు ఘోరి కట్టబడిందన్నారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్లో విలీనం కాబడిందన్నారు. ఆయన అమరుడై 78 సంవత్సరాలైనా నేటికీ భూమి సమస్య పరిష్కారం కాలేదని, పేదల కష్టాలు తీరలేదన్నారు. భూస్వామ్య అవశేషాలు కొనసాగుతూ కుల వివక్ష దోపిడీ పీడన కొనసాగుతున్నదన్నారు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా ప్రజల సమస్యలు తీరలేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందని ద్రాక్ష గానే మిగిలిందన్నారు. ఈ పరిస్థితుల్లో కొమరయ్య అందించిన పోరాట స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి సామాజిక న్యాయం సాధన కోసం పోరాడేందుకు ప్రతినబూనాలని, 78వ వర్ధంతి కార్యక్రమాలను జయప్రదంగా నిర్వహించి ఘనంగా నివాళులర్పించాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

# గర్భిణీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ



వరంగల్ వాయిస్, ములుగు : ఏరియా ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆసుపత్రి లోని ఇన్ వార్డ్ పేషంట్ లకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని , పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ వైద్య సిబ్బందికి ఆదేశించారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ ములుగు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీ హబ్ కేంద్రాన్ని, ఆసుపత్రి పరిసరాలను, సిబ్బంది రిజిస్టర్ ను, వంట గదిని, పేషంట్స్ వార్డులను, శానిటేషన్ పనులను, చిన్న పిల్లల వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సేవల కోసం వచ్చే గర్భిణీ స్త్రీలకోసం కుర్చీలు అందుబాటులో ఉంచాలని , ఇన్ వార్డ్ పేషంట్ లకు చిన్నారులకు పౌష్టిక ఆహారం అధించాలని అధికారులను ఆదేశించారు. నవజాత శిశువుల కోసం ఇంక్యూబెటర్స్ అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు సమయపాలన పాటించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి, విధులలో, శానిటేషన్ లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మల్హార్‌లో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన



**వరంగల్ వాయిస్, మల్హార్ :** మండలంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబు సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని వల్లెంకుంట గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12లక్షల రూపాయలతో నిర్మించిన అదనపు తరగతి గదులను, 20 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డులను, 20 కోట్ల రూపాయలతో కొయ్యూరు నుంచి రుద్రారం వరకు డబుల్ రోడ్ పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధన జరిగేందుకు ప్రభుత్వం పాఠశాలల మరమ్మతుల కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 8 మంది ఉపాధ్యాయులున్నారని 36 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని, బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల నమోదుకు చేపట్టిన చర్యలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో 48 మంది విద్యార్థులున్నారని మధ్యాహ్న భోజన పథకానికి గ్యాస్ మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఫొటోలు దిగి బాగా చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరగా స్పదించిన మంత్రి అప్పటి ప్రభుత్వం ఇష్టానుసారంగా 317 రాష్ట్రపతి ఉత్తర్వులు తయారు చేశారని అన్నారు. ఉద్యోగుల సమస్యలను గుర్తించిన ప్రభుత్వం సవరణ చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సవరణకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులను సంప్రదించి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిందని, రాష్ట్రపతి ఉత్తర్వులు సవరించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం లేదని, న్యాయ నిపుణులు సలహాలతో కమిటీ చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీఆర్డీఓ నరేష్, పంచాయతీరాజ్ ఈఈ దిలీప్, మండల ప్రత్యేక అధికారి అవినాష్, ఎంపీపీ చింతలపల్లి మల్హాల్ రావు, జడ్పీటీసీ అయిత కోమల రాజిరెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు

## మూఢనమ్మకాల నిర్మూలన చట్టం రావాలి

### జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సాంకేతిక యుగంలో కూడా ప్రజలు నేటికీ మూఢ విశ్వాసాలను నమ్ముతున్నారని ప్రభుత్వాలు మూఢనమ్మకాల నిర్మూల చట్టాన్ని తీసుకురావాలని అప్పుడు మాత్రమే బురిడి బాబాలు, దొంగ స్వాముల బారిన పడకుండా ప్రజలను కాపాడుకోగలమని జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు అన్నారు. మంగళవారం ఉత్తరప్రదేశ్ లోని హథ్రాస్ జిల్లా పుల్ రయీ గ్రామంలో భోలే బాబా సత్సంగ్ కార్యక్రమంలో చివరి రోజు భోలె బాబాను సందర్శించుకొని ఆయన పాదాలకు మొక్కుకొని, ఆయన పాదాల చెంత మట్టిని సేకరించి తీసుకెళ్లేందుకు జరిగిన తొక్కిసలాటలో గాలి ఆడక పలువురు ఒకరిపై ఒకరు పడి మృతి చెందిన ఘటన సందర్భంగా ఆయన ఆవేదనను వ్యక్తపరిచారు. భోలె బాబా పాద ధూళి కోసం వచ్చిన భక్తులు ఆ మట్టిలోనే కలిసిపోవడం పెనువిషాదమన్నారు. మృతి చెందిన వారిలో చిన్నారులు, మహిళలే అధికంగా ఉండటం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అనేక నూతన చట్టాలను ప్రజల రక్షణ కోసం తీసుకువచ్చింది. అదే మాదిరి దేశమంతా వర్తించే "మూఢనమ్మకాల నిర్మూల చట్టాన్ని" ప్రభుత్వం వెంటనే తీసుకువచ్చి ఇలాంటి ఘటనలకు చరమగీతం పాడాలన్నారు.

## మోహన్ రావు సేవలు అభినందనీయం



**వరంగల్ వాయిస్, నక్కల గుట్ట :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణా లిమిటెడ్, విద్యుత్ భవన్, కార్పొరేట్ కార్యాలయంలో వి.మోహన్ రావు ( సీజీఎం ఆపరేషన్- 1) పదవీ విరమణ ఆత్మీయ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి విచ్చేసి ప్రశంసా పత్రం, శాలువా, మెమొంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడ సమస్య ఉన్న పరిష్కరించే కృషీవలుడని కొనియాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించి సంస్థ కోసం ఎంతో సేవలందించి అందరి మన్నలను పొందారని అన్నారు. అహర్నిశలు కష్టపడి ఈ స్థాయికి చేరుకున్న వారి నిబద్ధతకు తార్కాణమని, ప్రతి ఒక్కరి జీవితంలో పదవి విరమణ సహజమని, వారి భావి జీవితం సంతోషంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్లు (హెచ్ఆర్డీ) బి.అశోక్ కుమార్, డైరెక్టర్(ప్రాజెక్ట్స్) టి.సదర్ లాల్, డైరెక్టర్(ఫైనాన్స్) వి.తిరుపతి రెడ్డి, డైరెక్టర్(ఆపరేషన్) టి.మధుసూదన్, సీజీఎంలు రాజుచౌహాన్, కెవెన్ గుట్ట, రవీంద్రనాథ్ , సీవీవో బి.జనార్దన్, జీఎంలు, వివిధ సర్కిళ్ల ఎస్ఈలు, ఉద్యోగ సంఘాల నాయకులు, ట్రేడ్ యూనియన్లు, ఆసోసియేషన్ నాయకులు పాల్గొన్ని శుభాకాంక్షలు తెలిపారు

# గత ప్రభుత్వంలో సర్పంచులకు, ఎంపీటీసీలకు ఇబ్బందులు




**వరంగల్ వాయిస్, మరిపెడ :** గత ప్రభుత్వంలో గ్రామ సర్పంచులు,ఎంపీటీసీలు ఇబ్బందులకు గురయ్యారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. జాటోత్ రాంచందర్ నాయక్ అన్నారు. ఎంపీపీ గుగులోత్ అరుణ రాంబాబు, మండల పరిధిలోని ఆయా గ్రామాల ఎంపీటీసీల పదవీ కాలం ముగుస్తుండటంతో బుధవారం మరిపెడ మండల కేంద్రం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుగులోత్ ఆరుణ రాంబాబు నాయక్ అధ్యక్షతన వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రాంచందర్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ అరుణ రాంబాబు, ఎంపీటీసీలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మరిపెడ పెద్ద మండలం గిరిజనులు అత్యధికంగా ఉన్నారని, ఎంపీపీ, జడ్పీటీసీ, మున్సిపల్ చైర్మన్లు ముగ్గురు గిరిజన మహిళలు అయ్యారని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి రిజర్వేషన్లు మారుతాయో లేదో చూడాలన్నారు. గత ప్రభుత్వంలో రెండు సంవత్సరాలు కోవిడ్ తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సర్పంచులు, ఎంపీటీసీలకు తీవ్రమైన నష్టం వాటిల్లిందన్నారు. గత ప్రభుత్వం మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని నిధుల మళ్లింపుతో ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యిందని ఆయన అన్నారు. గ్రామాల్లో పార్టీలకతీతంగా మంచివాళ్లను ఎన్నుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం సర్పంచ్ లు, ఎంపీటీసీలు నిధులివ్వక, పెండింగ్ బిల్లులు సకాలంలో చెల్లించక ఆర్థికంగా కుదేలయ్యిన ప్రజాప్రతినిధులు రాజకీయాలంటేనే ఆమడ దూరంలో ఉంటున్నారని ఆయన అన్నారు. రాజకీయాల్లో బాధ్యతగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొన్నిసార్లు ప్రజాక్షేత్రంలో శక్తి వంచన లేకుండా పనిచేసినా పరాభవం తప్పదని ఆయన అన్నారు. జడ్పీటీసీ తేజావత్ శారదా రవీందర్, మున్సిపల్ చైర్మన్ సింధూర రవి నాయక్, వైస్ ఛైర్మన్ గాదె అశోక్ రెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## రేపు ఖమ్మంలో దొడ్డి కొమరయ్య వర్ధంతి రాష్ట్ర సదస్సు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** భూమి కోసం, భుక్తి కోసం, ఈ దేశ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు కామ్రేడ్ దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సదస్సు రేపు ఖమ్మంలో జరుగుతుందని ఈ సదస్సును జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు తెలిపారు. బుధవారం ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ సెంటర్ లో సదస్సును జయప్రదం చేయాలని ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో మధ్యాహ్నం 12 గంటలకు సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రెండు రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో జరుగుతుందని వారు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ హాజరై ప్రసంగిస్తారని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జేవీ చలపతిరావు, సాదినేని వెంకటేశ్వరరావు, వి కోటేశ్వరరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, గోవర్ధన్, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాళు ఝాన్సీ, సంధ్య తదితరులు ప్రసంగిస్తారని వారన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ ప్రజా సంఘాల నాయకులు బండి కోటేశ్వరరావు, గంగుల దయాకర్, రాచర్ల బాలరాజు, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు రంజిత్, ఐఎఫ్ టీయూ నాయకులు బన్న నర్సింగం, బండి కుమార్, సాంబయ్య, ఇనుముల కృష్ణ, ఎండీ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయం అడిషన్ కమిషనర్ గా, సెక్రటరీగా యన్. కృష్ణా రెడ్డి అదనపు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మినిస్టీరియల్ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ లు బాకం సంతోష్ కుమార్, రావుల ఆనంద్, రామకృష్ణ, హబీబ్ పాషా, బండారు రవికుమార్, ఉమా దేవేందర్, చీకటి గిరిబాబు, సుఖథ, సునీల్, సూర్యనారాయణ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## పార్లి శారోన్ సేవలు మరువలేనివి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అన్నారు. నగరంలోని దేశాయిపేటలో బుధవారం డాక్టర్ పార్లీ షారోన్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఉచిత వైద్య శిబిరం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ జన్ను అహరోను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ ఏసీపీ నందీరా నాయక్ విచ్చేసి మాట్లాడుతూ డాక్టర్ పార్లీ షారోన్ తల్లిదండ్రులైన జన్ను ఆరోను క్రాంతిలు తమ కూతురిని మంచిగా చదివించి డాక్టర్ ను చేశారని ప్రమాదవశాత్తు తాను మన మధ్యలో లేకపోవడం బాధాకరమని, కూతురు జ్ఞాపకార్థం మర్చిపోకుండా ఎప్పుడు ప్రజల్లో ఉండేందుకు సేవా కార్యక్రమాలు చేయడం మంచి పరిణామమని వారి కుటుంబాన్ని ఏసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు సురేష్ కుమార్ జోషి, కావటీ కవిత రాజు యాదవ్, పాస్టర్ సుభాష్, డాక్టర్ మనోహర్, ఓయాసిస్ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జన్ను పరంజ్యోతి, పల్ రత్న, రవిరాకుల స్ఫూర్తి, డాక్టర్ ఆశ, డాక్టర్ జయరాజు దేశాయిపేట పట్టణ ఆరోగ్య కేంద్ర కమ్యూనిటీ కోఆర్డినేటర్ జన్ను కోర్నెలు పాల్గొనగా దేశాయిపేట ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 12వ డివిజన్ కార్పొరేటర్ కవిత రాజు యాదవ్ పాల్గొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని అభివృద్ధి చేయడం ద్వారా మానవ మనుగడ సాధ్యమైతుందని, ప్రతి ఒక్కరూ చెట్లను పెంచితేనే ప్రాణవాయువు అందరికీ పుష్కలంగా లభిస్తుందని, ప్రతి ఒక్కరూ చెట్టు నాటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు నిశాంత్, జీవన్, చక్రపాణి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అడ్వెంచరస్ డ్రామాగా తంగలాన్




కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్  కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ సినిమా తంగలాన్ . హిస్టారికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్నాడు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా వస్తోన్న ఈ చిత్రంలో మలబార్ సోయగం మాళవికా మోహనన్, పార్వతి తిరువొత్తు ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. పశుపతి, డానియెల్ కల్టగిరోన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అడ్వెంచరస్ డ్రామా నేపథ్యంలో బంగారం, రక్తం, కన్నీటి చుట్టూ సాగే కథగా తంగలాన్ ఉండబోతుందని గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్లు చెప్పకనే చెబుతున్నాయి. విక్రమ్ తంగలాన్‌లో తన పాత్రకు న్యాయం చేసేందుకు ఎంత ప్రాణం పెట్టి రిస్క్ చేశాడో తెలియజేస్తూ మేకర్స్ రిలీజ్ చేసిన వీడియో చూసిన సినీ జనాలు విక్రమ్ డెడికేషన్‌కు హ్యాట్సాఫ్ చెబుతున్నారు. కాగా తంగలాన్ ఎప్పుడు ప్రేక్షకుల ముందుకొస్తుందనే దానిపై ఏదో ఒక వార్త నెట్టింట చక్కర్లు కొడుతూనే ఉంది.
ముందుగా వచ్చిన వార్తల ప్రకారం ఈ చిత్రం ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలవుతోంది. ఈ విషయాన్ని నిర్మాత ధనుంజయన్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. తమిళ సినిమాలో ఐకానిక్ మూవీగా నిలిచిపోనుంది. 18వ శతాబ్దం-19వ శతాబ్దం మధ్య సాగే కేజీఎఫ్ బ్యాక్‌డ్రాప్ కథ ఇది. చియాన్ విక్రమ్ యాక్టింగ్ మీ అందరినీ ఆశ్చర్యపరచడం పక్కా. సినిమా ఆగస్టు 15న వస్తుందంటూ క్లారిటీ ఇచ్చేశారు. దీంతో ఫుల్ ఖుషీ అవుతున్నారు విక్రమ్ అభిమానులు. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై కేఈ జ్ఞానవేల్ రాజా తెరకెక్కిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తంగలాన్ నుంచి ఇప్పటికే మాళవికా మోహనన్ లుక్ విడుదల చేయగా.. డీగ్లామరైజ్‌డ్‌గా కనిపిస్తూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది.

# కల్కిని తట్టుకుని నిలబడ్డ మహారాజు



కంటెంట్ నమ్మి సినిమాలు చేసే స్టార్ యాక్టర్లలో ఒకరు కోలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ సేతుపతి . ఈ స్టార్ హీరో నటించిన తాజా చిత్రం మహారాజ . నితిలన్ సామినాథన్ దర్శకత్వంలో మక్కళ్ సెల్వన్ 50 గా తెరకెక్కిన మహారాజ జూన్ 14న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైంది. విడుదలైన మొదటి రోజు నుంచి వసూళ్ల విషయంలో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. ప్రభాస్ కల్కి 2898 ఏడీ ఫీవర్ కొనసాగుతున్నప్పటికీ మహారాజ రికార్డు వసూళ్లు రాబట్టడం విశేషం. మహారాజ మూడో వీకెండ్‌లో వరల్డ్‌వైడ్‌గా రూ.100 కోట్ల గ్రాస్ రాబట్టింది. తాజా సమాచారం ప్రకారం ఇండియావైడ్‌గా రూ.76 కోట్లు, ఓవర్సీస్‌లో రూ.24 కోట్లుగా ఈ వసూళ్లు ఉన్నాయి. ఈ ఏడాది రూ.100 కోట్ల మార్క్ అధిగమించిన తమిళ సినిమాగా మహారాజ రికార్డుల్లోకెక్కడం విశేషం. గత గురువారం విడుదలైన కల్కి 2898 ఏడీ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తున్నప్పటికీ మహారాజ ఈ స్థాయిలో వసూళ్లు రాబట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుండటం విశేషం. కల్కి 2898 ఏడీ ఐదు రోజుల్లో రూ.600 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టింది. అంతేకాదు మహారాజ వరల్డ్ వైడ్ బాక్సాఫీస్ వద్ద టాప్ గ్రాస్ సాధించిన అరణ్మనై 4ను అధిగమించడం విశేషం. ఈ హార్రర్ కామెడీ ప్రపంచవ్యాప్తంగా రూ.99 కోట్లు గ్రాస్ సాధించింది. మహారాజ లాంగ్ రన్‌లో రూ.105 కోట్లు వసూళ్లు చేసే అవకాశాలున్నాయని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.




గతేడాది 'భగవంత్ కేసరి' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి తాజాగా మరో చిత్రానికి శ్రీకారం చుట్టారు. వెంకటేష్‌తో ఆయనొక సినిమా చేయబోతున్నారనే వార్త చాలాకాలంగా హల్‌చల్ చేస్తోంది. కొద్ది రోజుల క్రితం ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. 'ఎఫ్2', 'ఎఫ్3' చిత్రాల తర్వాత వెంకటేశ్ తో  అనిల్ పని చేస్తున్న చిత్రమిది. ఇందులో ఓ నాయికగా మీనాక్షి చౌదరిని ఇప్పటికే ఎంపిక చేశారు. తాజాగా మరో నాయిక పాత్ర కోసం ఐశ్వర్య రాజేశ్‌ని తీసుకున్నట్లు ఆయన తెలిపారు. బాపట్ల జిల్లా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన  స్క్రిప్ట్ ను  స్వామి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'యాక్షన్ నేపథ్యంలో సాగే సినిమా ఇది. ఇందులో వెంకటేశ్ భార్యగా ఐశ్వర్య, ఆయన ప్రియురాలి పాత్రలో మీనాక్షి చౌదరి కనిపించనున్నారు. ఈ నెల 3 నుంచి చిత్రీకరణ మొదలుపెడతాం. నవంబరులో పూర్తి చేసి వచ్చే సంక్రాంతికి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు. ఎస్.వి.సి సంస్థలో వస్తున్నా 58వ చిత్రమిది. దిల్ రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.









రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్'లో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమాలో హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమా ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన ఈ  సినిమా టీజర్ అందరికీ మంచి కిక్ ఇచ్చి.. సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను 'మాస్ సాంగ్ ఆఫ్ ది ఇయర్' అంటూ మేకర్స్ విడుదల చేశారు. 'స్టెప్పామార్' అంటూ సాగే ఈ పాట హై ఎనర్జిటిక్ మాస్ మూమెంట్స్‌తో సాగింది. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, సాహితీ ఆలపించారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందించిన ఈ సాంగ్‌కు మణిశర్మ సంగీతం అందించారు.

# బాలల సంరక్షణ సామాజిక బాధ్యత

## వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

## క్షేత్రస్థాయిలో ట్రాఫిక్ జంక్షన్ల పరిశీలన



**వరంగల్ వాయిస్, క్రైం :** బాలల సంరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వెట్టిచాకిరీ నుంచి బాల కార్మికులకు విముక్తి లభించేలా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం 10వ విడత పోస్టర్లను బుధవారం ఆయన ఆవిష్కరించారు. పోలీసులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎన్జీఓ సంస్థలకు ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పభుత్వ పథకంలో భాగంగా జులై 1వ తేది నుంచి జులై 31వ తేది వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో బాల కార్మికులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆశ్రమాల్లో ఆచూకీ తెలియకుండా పోతున్న వారితోపాటు వేధింపులకు గురైన బాలలను గుర్తించి వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో అట్టి పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడాలన్నారు. పిల్లల పట్ల ఎవరైనా కఠినంగా వ్యవహరిస్తే తగిన చర్యలు చేపట్టాల్సిందిగా పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, హనుమకొండ, వరంగల్, జనగాం జిల్లాలకు చెందిన బాలల సంరక్షణ సమితి చైర్ పర్సన్లు దామోదర్, వసుధ, ఉప్పలయ్య, బాలల పరిరక్షణ అధికారులు ప్రవీణ్, రాజు, రవికాంత్, చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్స్ భాస్కర్, శ్వేత, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్లు ఎర్ర శ్రీకాంత్, బత్తుల కరుణ, డైరెక్టర్ సిస్టర్ సహాయ, షేర్ ఎన్జీవో ప్రతినిధులు శిరీష, వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏహెచ్ టీయూ సిబ్బంది పసియోద్దీన్, మల్లేష్, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, రామారావుతో పాటు మూడు జిల్లాలకు చెందిన పోలీస్, లేబర్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ జంక్షన్ల పరిశీలన..

ట్రాఫిక్ రద్దీ నియంత్రణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ట్రాఫిక్ అధికారులతో కలిసి హనుమకొండ ప్రాంతంలో పలు ట్రాఫిక్ జంక్షన్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మర్కజీ పాఠశాల వద్ద మూసివేసిన ట్రాఫిక్ జంక్షన్ పరిశీలించారు. మర్కజీ జంక్షన్ వద్ద మూసి వేయడం ద్వారా కుమార్‌పల్లి మార్కెట్, ఈదుల వాగు, పెద్దమ్మగడ్డ తదితక ప్రాంతాలకు వేళ్ళే వాహనదారులు మిషన్ హస్పటల్ వద్ద యూ టర్న్ తీసుకొని రాంగ్ రూట్‌లో వాహనదారులు ప్రయాణిస్తుండంతో పాటు, నయీంనగర్ ప్రాంతంలోని ప్రధాన రోడ్డు మార్గంలోని బ్రిడ్జ్ పనులు కొనసాగుతుందడంతో కేయూసీ వైపు వేళ్ళే వాహనదారులకు మర్కజీ జంక్షన్ వద్ద డివైడర్‌ను మూసి వేయడంతో వాహనదారులకు ఇబ్బందులకు గురౌవుతున్నట్లుగా పోలీస్ అధికారులకు పలు విన్నపాలు రావడంతో దీనిపై స్పందించిన పోలీస్ కమిషనర్ క్షేత్ర స్థాయిలో మర్కజీ జంక్షన్ పరిశీలించారు. ఈ జంక్షన్ తిరిగి పున:ప్రారంభించడం ద్వారా ట్రాఫిక్ క్రమబద్దీకరణలో కలిగే సానుకూల పరిణామాలపై పోలీస్ కమిషనర్ ట్రాఫిక్ అధికారులను అడిగితెలుసుకున్నారు. ప్రస్తుత స్థితిగతుల దృష్యా వాహనదారులకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మర్కజీ జంక్షన్ వద్ద మూసి డివైడర్లను తోలిగించాల్సిందిగా పోలీస్ కమిషనర్ అధికారులకు అదేశించడంతో పాటు, ఈ జంక్షన్ నుంచి ప్రయాణించే వాహనాల సంఖ్య దృష్టిలో వుంచుకొని ఈ జంక్షన్ వద్ద విధులు నిర్వహించేందుకుగాను ఏఆర్ పోలీస్ సిబ్బందిని వినియోగించుకోవాల్సిందిగా పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. అనంతరం ఆదాలత్ జంక్షన్‌ను పరిశీలించారు. ఈ జంక్షన్‌తో పాటు నగరంలోని ఇతర జంక్షన్లలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడంతో గతంలో ఎర్పాటు చేసిన పాత ట్రాఫిక్ సిగ్నల్ కొత్తగా ఎర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ అడ్డుగా నిలవడంతో వాహనదారులకు సిగ్నల్స్ సరిగా కనిపించ ఇబ్బందులకు గురౌవుతున్నారు. ఈ సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన పోలీస్ కమిషనర్ పాత ట్రాఫిక్ సిగ్నల్స్ తొలిగించి నగరంలో నూతనంగా ఏర్పాటు చేసేందుకుగాను ట్రాఫిక్ అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. పోలీస్ కమిషనర్ వెంట ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్లు షూకూర్, నాగబాబు, హనుమకొండ ఇన్స్‌స్పెక్టర్ సతీష్ ఉన్నారు.



# 6నుంచి శాకాంబరి ఉత్సవాలు

## పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని సుప్రసిద్ధ భద్రకాళి దేవాలయంలో ఈ నెల 6నుంచి 21 వరకు అత్యంత వైభోవోపేతంగా శ్రీ భద్రకాళి అమ్మవారి శాకాంబరీ నవరాత్ర మహోత్సవాలను నిర్వహించనున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు దేవాలయ కార్యనిర్వహనాధికారి శేషభారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, సూపరింటెండెంట్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. 6వ తేదీ శనివారం ఆషాడ శుద్ధ పాడ్యమి రోజున భద్రకాళి అమ్మవారికి సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. శాకాంబరి ఉత్సవాల్లో చివరి రోజైన 21వ తేదీ ఆదివారం ఆషాడ శుద్ధ పౌర్ణమి రోజున శాకంబరి అలంకరణలో అమ్మవారు దర్శనమీయనున్నట్లు వెల్లడించారు. దీంతో ఉత్సవాలు సమాప్తి అవుతాయన్నారు.



# ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పత్తిపాక గ్రామంలో ముదిరాజ్ కులదైవమైన పెద్దమ్మ తల్లికి ప్రతి ఏటా నిర్వహించే బోనాలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముదిరాజ్ కులస్తులు డీజే సౌండ్స్ తో బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మ తల్లికి సమర్పించారు. పాడి పంటలతో పిల్లపాపలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని పెద్దమ్మ తల్లిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కులపెద్ద మనుషులు బోయిని సారంగపాణి, బోయిని కుమార్ స్వామి, బోయిన పైడి, కొడిమాల మహేందర్, పల్లెబోయిన కరుణాకర్, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

# నిండా ముంచిన వ్యాపారి

## ఆందోళనలో రైతులు

## రూ.10కోట్లతో ఉడాయించినట్లు ఆరోపణ




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఆరుగాళం కష్టించి పడ్డించిన రైతులకు ఆ వ్యాపారులు ఎగనామం పెట్టారు. వ్యాపారులు ఇమ్మడి మధుకర్, అంచూరి సంతోష్ రూ.10కోట్లతో ఉడాయించడంలో రైతులు లబోదిబోమంటున్నారు. ఇద్దరు వ్యాపారులు ఐపీ పెట్టి పరారైనట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రైతులను నిండా ముంచి వారి డబ్బులతో బహుళ అంతస్తుల నిర్మాణం చేయడంపై మండిపడుతున్నారు. మాట్టేవాడ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ప్రధాన రహదారిపైనే నిర్మిస్తున్న ఐదు అంతస్తుల మేడ వద్దకు చేరుకున్న రైతులు, ఇతర బాధితులు అక్కడే ఆందోళన చేపట్టారు. నిర్మాణంలో ఉన్న భవనానికి ఫ్లెక్సీ కట్టి నిరసన తెలిపారు. రైతులు, బాధితులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని ఆందోళన చేయడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని సముదాయించారు. రైతులకు తగిన న్యాయం చేస్తామంటూ హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.



# గీసుకొండ సీఐగా బాబులాల్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** గీసుగొండ సీఐగా జి.బాబులల్ బుధవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ఎల్.పవన్ కుమార్ ను టాస్క్ ఫోర్స్ వరంగల్ కు పంపడంతో ఆ స్థానంలో బాబులాల్ ను నియమించారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయానికి చేరుకున్న ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అ క్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకు సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం సీపీ అంబర్ కిషోర్ ఝాను మర్యాద పుర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com